05ATP03_05ATP03.qxd 03-03-2025 PM 11:19 Page 1



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన శనగల గూడూరు రైతులు



కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన రైతులు

**పుట్లూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని శనగల గూడురు గ్రామ రైతులు సోమవారం అనంతపురంలో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఓఎన్‌జిసి కంపెనీ వారు గ్రామస్తుల అనుమతి లేకుండా గ్యాస్, ఖనిజాల నిక్షేపాల కోసం చేస్తున్న తవ్వకాల వల్ల గ్రామంలో భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం వుందని అంతేకాకుండా గ్రామంలో కాలుష్యం పెరిగే అవకాశం వుందని వీటిపై గ్రామంలో ప్రజాఅభిప్రాయ సేకరణ చేయాలని అనుమతి లేకుండా ఓఎన్‌జిసి కంపెనీ వారు బోర్లు వేస్తే అడ్డుకుంటామని వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

## విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ




విద్యార్థులకు ప్యాడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**పెద్దవడుగూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో 10వతరగతి, ఇంటర్మీడియట్ బాలికలకు పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ప్యాడ్లు, పెన్నులు, పౌచ్‌లను సోమవారం అందచేశారు. మొత్తం 91 మంది విద్యార్థులకు వీటిని అందచేశారు. పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు వాటిని అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అనిష్‌బాష, కళాశాల ప్రిన్సిపాల్ ఉష, కళాశాల సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**పుట్లూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 72 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి సుబ్బయ్య, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిటౌన్, మార్చి 3 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని బిల్వపత్రాలతో పాటు వివిధ రకాల పూలమాలలతో, వెండి ముఖం కవచంతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం అభివృద్ధి పనులకు విరాళాలు అందజేత

**యాడికి, మార్చి 3 ప్రభాతవార్త**



విరాళం అందచేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని నారాయణస్వామికానీలో వినాయకుని గుడి వెనుక వైపు 1993లో నిర్మించిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు చొరవ తీసుకుని అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రహరీ గోడ, బాత్రూం, గోపుర పుశాల, కాంపౌండ్‌లో బండపరుపు తదితర పనులను దాదాపు 7 లక్షల రూపాయలతో చేపట్టారు. ఈ అభివృద్ధి పనులకు గాను నారాయణస్వామికాలనీకి చెందిన పల్లా కృష్ణమూర్తి కుమారుడు పల్ల పరమేశ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లక్ష రూపాయలను విరాళంగా ఆలయ అర్చకులు జయుడుస్వామికి అందచేశారు. ఇదే కాలనీకి చెందిన ఎల్లపు పెద్దనారాయణ 50 వేల రూపాయలను అందచేయడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు వై.శ్రీనివాస్‌యాదవ్ (టీచర్), ఓబులేసు, నరసింహులు, ఆదిశేషు, శ్రీరాములు, చంద్రహాస్‌రెడ్డి, ఓబులరాజు, రాజేష్, నారాయణస్వామి, తదితరులు వారిని అభినందించారు.

## శ్రీచక్రభీమలింగేశ్వరునికి అభిషేకాలు

**పెద్దపప్పూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు బాలుస్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీఅశ్వత్థనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అశ్వత్థానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## సోలార్‌షాపును ప్రారంభించిన కొత్తపల్లి మల్లికార్జున

### - కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ పథకం వర్తిస్తుంది



సోలార్‌షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, మార్చి 3 ప్రభాతవార్త**

పట్టణంలోని మార్కండేయస్వామి దేవాలయం ఎదురుగా నూతన సోలార్ షాపును మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకుడు ఎస్‌వి రవీంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు హాజరయ్యారు. అందరి సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపి సోలార్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్బంగా షాపు నిర్వాహకుడు కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం సూర్యఘర్ సోలార్ సబ్సిడీ స్కీమ్ అందుబాటులో వుంటుందన్నారు. బిల్డింగ్‌పై ఖాళీగా వున్న స్థలంలో ఈ సోలార్‌ను అమర్చవచ్చని తెలిపారు. గృహము, ఆసుపత్రులు, స్కూల్స్, తదితర అవసరాలకు సోలార్ యూనిట్ల ద్వారా కరెంట్ ఆదా చేయడంలో లాభసాటిగా వుంటుందన్నారు. సోలార్ ఏర్పాటుకు బ్యాంకు లోను సదుపాయం కూడా వుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9346888696కు సంప్రదించాలని ఆయన కోరారు.

## ఉద్యోగులను దూషిస్తున్న పెన్షన్‌దారులు

**పుట్లూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండంలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఎన్‌టిఆర్ భరోసా కింద పెన్షన్లు తీసుకుంటున్న పలువురు వృద్ధులు, దివ్యాంగులు అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని పలువురు సచివాలయం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా 1వతేదీన ప్రభుత్వం ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. సచివాలయం ఉద్యోగులు ఉదయం 6 గంటలకే పెన్షన్‌దారుల ఇంటి వద్దకు వెళితే వారు అందుబాటులో లేకపోగా తమపైనే దురుసుగా మాట్లాడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు పెన్షన్ పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఒకవైపు ఒత్తిడి వుండడంతో పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళితే వారు అందుబాటులో వుండరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునేలా అవకాశం కల్పించడంతో పెన్షన్ దారులు సచివాలయం ఉద్యోగులకు సహకరించలేదని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

## డంపింగ్ యార్డ్ ను తొలగించండి: సిపిఎం



మేయర్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**అనంతపురం మార్చి 03ప్రభాతవార్త**

అనంతపురం నగరానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ ను తొలగించాలని సోమవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ , నగర మేయర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాభీ మాట్లాడుతూ రాజీవ్ కాలనీ పంచాయతీలో ఉన్న ప్రజలందరూ ఈ డంపింగ్ యార్డ్ వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున ఈ డంపింగ్ యార్డ్ ను ఇక్కడి నుండి తొలగించాలని కోరారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వీరనారప్ప మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నుండి విషపూరితమైన గాలి,దుర్వాసన వచ్చి పిల్లల ప్రాణాలకు హానికరంగా మారిందని కావున ఈ డంపింగ్ యార్డ్ ను నగరానికి దూరంగా తరలించాలని కోరారు. లెక్చరర్స్ కాలనీ ప్రెసిడెంట్ ఆర్ ఐ ఓ కిష్టప్ప, సురేష్ ,రిటైర్డ్ ప్రిన్సిపాల్ భాస్కర్, టి వీ రెడ్డి, బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ ఉన్నతమైన ఉద్యోగాల్లో ఉండి రిటైర్డ్ అయిన మేము వచ్చిన సొమ్ముతో ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని ఇండ్లు కట్టుకొని ఉంటే ఈ డంపింగ్ యార్డ్ నుండి కలుషితమైన గాలి, దుర్వాసన రావడంతో మా ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నది. కావున ఈ డంపింగ్ యార్డ్ ను తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఈ డంపింగ్ యార్డ్ సమస్యను వీలైనంత తొందరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కమిషనర్ మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వి. రామిరెడ్డి, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్, టిడిపి నాయకులు రసూల్, రాజీవ్ కాలనీ ఉపసర్పంచ్ మసూద్, సిపిఎం పార్టీ నగర నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా,సీన ,వెంకటేష్, ఓబిలేష్, లతీఫ్ ,ఎర్రి స్వామి, వరలక్ష్మి, నూరుల్లా,అనిల్ ,ఇస్మాయిల్ , రామాంజనేయులు పాల్గొన్నారు.

## పి4 మోడల్ మరియు ఇతర ప్రభుత్వ సర్వేలను పకడ్బందీగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

**అనంతపురం మార్చి 3 ప్రభాతవార్త**

జీరో ప్రావర్టీ సర్వే సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ పి4 విధానాన్ని రూపొందించిందన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశం మందిరం లో నిర్వహించిన సమావేశం లో అధికారులను ఉద్దేశించి కమీషనర్ బాలస్వామి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతీ ఒక్కరి జీవన ప్రమాణాలను పెంచేందుకు జన్మభూమి స్ఫూర్తితో పీ4 విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పేదలు ఆర్థిక సంస్కరణలతో ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. సర్వే ద్వారా గుర్తించిన పేదలకు ప్రభుత్వ పథకాలు, సీఎస్సార్ నిధులు, ఎన్ఆర్ఐల సహకారంతో కనీస జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అలాగే ఇతర సర్వే ప్రక్రియ తత్వరగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశం లో అధికారులు అన్ని విభాగల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక

### - జిల్లా ఎస్‌పి జగదీష్

**అనంతపురం కలెక్టరేట్, మార్చి 3 ప్రభాతవార్త**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ఎస్‌పి జగదీష్ 72 పిటిషిన్లను స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలు విచ్చేసి తమ సమస్యలపై పిటిషన్లను అందచేశారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. కుటుంబకలహాలు, భార్యాభర్తల గొడవలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డివి రమణమూర్తి, మహిళా డిఎస్‌పి ఎస్.మహబూబ్‌బాష పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై తాహసిల్దార్ వినతి పత్రం అందజేసిన సిఐటియు నాయకులు

**నల్లచెరువు మార్చ్ 3 ప్రభాతవార్త**



తాసిల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న. సిఐటియు నాయకులు రామకృష్ణ

సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక తాహసిల్దార్ రవికుమార్ కి సిఐటియు నాయకులు రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఈ తరుణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని రామకృష్ణ అన్నారు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ వంటి డబ్బులను రైతుకు ఒకేసారి ఖాతాలో వేస్తే బాగుంటుందని ఆయన ఎవరైనా వివరించారు విత్తనాలకు ఎరువులకు మరియు ఇతర కూలీల ఖర్చులకు కావాల్సి న డబ్బులు విడతల వారిగా వేయడం వలన అది రైతుకు ప్రయోజనం ఉండదన్నారు రైతు పైన దృష్టి పెట్టి రైతు కష్టాలను తీర్చే విధంగా 20 వేల రూపాయలు ఒకేసారి రైతుల అకౌంట్లో పడేవిధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రతిఏటా రైతు పంట పెట్టి పెట్టుబడి కూడా రాకపోవడం వలన అప్పులు పాలు అవుతున్నాడు పిల్లలను చదివించుకోలేక సంసారానికి కావాల్సి న డబ్బులు లేక వడ్డీ వ్యాపారస్తుల దగ్గరికి వెళ్లి ప్రాధేయపడవలసిన అవసరం ఏర్పడుతుందన్నారు అందరికీ అన్నం పెట్టే రైతుకు కష్టాలు వస్తే ఆదుకునే నాధుడు కరువయ్యాడు అన్నాడు ఈ తరుణంలో సంబంధిత అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు చిత్తశుద్ధితో ఆలోచించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని శ్రీరాములు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిపిఎం నాయకులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎంపీడీవో



చలివేంద్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రఘునాథ గుప్తా.

**నల్లచెరువు మార్చి 3 ప్రభాతవార్త**

నల్ల చెరువు మండల కేంద్రంలోని బసమన్న కట్ట సమీపంలో ఆనంద్ టైలర్ ఆధ్వర్యంలో చలివేంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధికారులుగా ఎంపీడీవో రఘునాథ గుప్త ఏవో రామకృష్ణ. ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున గ్రామ ప్రజలుకు దాహాన్ని తీర్చే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారని.. వివిధ గ్రామాల నుండి వచ్చే గ్రామ ప్రజలకు పాదచారులకు దాహం వేస్తే తక్షణ అనుకూలంలో బస్సు వన్న కట్ట సమీపంలో ఉన్న చలివేద్రంలో చల్లటి నీటితో దాహాన్ని తీర్చుకోవచ్చని ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసిన వికలాంగుడైన ఆనంద్ టైలర్ తమ సొంత నిధులతో చలివేంద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని. వారికి ఎంపీడీవో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేష్. శ్రీనివాసులు హుస్సేన్ పీరా. గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులతకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

### సిపిఐ నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన చేపడుతున్న సిపిఐ నాయకులు రెడ్డప్ప మండల ప్రజలు

**తనకల్లు, మార్చి 03 ప్రభాతవార్త:**

తనకల్లు మండల లో ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం సిపిఐ నాయకులు ప్రజలు నిర్వహించారు. ఈ సందర్బంగా నిరుపేదలందరికీ గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు స్థలంతో పాటు ఇల్లు నిర్మించడానికి రూ.5లక్షలు మంజూరు చేయాలి అంతేకాకుండా నిర్మాణానికి సంబంధించిన సిమెంట్, ఇసుక, ఐరన్ లాంటి అందజేయాలని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి తామె ఇల్లు కట్టిస్తామని చెప్పిన హామీని వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో దశలవారిగా ఉద్యమాలు చేపడతామని పుట్టపర్తి లో జరిగే కలెక్టర్ కార్యాయలం వద్ద ధర్నాకు తనకల్లు మండలం నుంచి సిపిఐ నాయకులు కార్యకర్తలతో పాటు ఇంటి స్థలాలు లేని వారు భారీ ఎత్తున తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సిపిఐ నాయకులు రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమికోన్నత పాఠశాలగానే కొనసాగించాలి



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**అమడగూరు, మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని ఆకులవారిపల్లి గ్రామంలోని ఎంపియుపి స్కూల్‌ను యదావిధిగా ప్రాథమికోన్నత పాఠశాలగానే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు సోమవారం ఎంఇఒ జిలాన్‌బాష, అమడగూరు హెచ్‌ఎం శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకులవారిపల్లిలోని ఎంపియుపి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా డిగ్రేడ్ చేసి మిగిలిన 6,7.8 తరగతులను చిన్నగానిపల్లి పాఠశాలలో విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆకులవారిపల్లిలోని ఎంపియుపి పాఠశాలను యదావిధిగా ప్రాథమికోన్నత పాఠశాలగానే కొనసాగించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకులవారిపల్లి గ్రామస్తులు జయరాం, ఆనంద్, విశ్వనాథ్, మునియప్ప, శ్రీనివాసులు, రాము, లలిత, నారాయణమ్మ, లతమ్మ, మంజుల, నిర్మల, అంజనప్ప, రామచంద్ర, సంజీవ్, పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆంధ్ర తెలంగాణ కార్గో సర్వీస్ లో అగ్నిప్రమాదం

**అనంతపురం మార్చి 3 ప్రభాతవార్త**



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పాత రాజహంస అపార్ట్మెంట్లు పక్కన ఆర్టీసీ ఆంధ్ర తెలంగాణ కార్గో సర్వీస్ లో షార్ట్ సర్క్యూట్ అయ్యి అందులో ఉన్న విలువైన వస్తువులన్నీ కాలిపోయినట్లు సమాచారం. సుమారు 9 లక్షల రూపాయలు విలువైన వస్తువులు అని సమాచారం. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

## రైతులను ఆదుకోవాలి: ఏపి రైతు సంఘం




తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

**ఓబుళదేవరచెరువు, మార్చి 3, ప్రభాతవార్త**

వ్యవసాయ రంగంలో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని ఏపి రైతు సంఘం నాయకులు వివి రమణ, రామిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్పలు తహశీల్దార్ అనంతాచారిని కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌ను కలసి రైతాంగ సమస్యలపై వివరించారు. జిల్లా వా ్యప్తంగా రైతులు పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట పెట్టుబడులతో రైతు ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పంట పండితే గిట్టుబాటు ధర లభించడం లేదనా న్నరు. తక్షణం ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామక్రిష్ణ, నాగేంద్ర, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అట్టలు పెన్నులు బహుకరణ




విద్యార్థులకు అట్టలు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ బృందం

**ఓబుళదేవరచెరువు, మార్చి 3, ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ తలబా టీం సభ్యులు సోమ వారం అట్టలు, పెన్నులు, మెండర్, ఏరేజర్‌లు బహుకరించారు. టీం సభ్యులు ఆరీఫ్, ఫయాజ్, ముస్తాఖ్, వసీం, ఇద్రీస్, ఇస్మాయిల్, ఇమ్రాన్, సయ్యద్, ఇమామ్‌బాషలు రూ 30 వేల సొంత నిధులతో దాదాపు 410 మంది విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే వస్తువులను అందించారు. త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో అందరూ బాగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణ సాధించాలని వారు ఆశీర్వదించారు. గతంలో కోవిడ్-19 పరిస్థితుల్లో దాదాపు 436 మంది కరోనా రోగులకు పలు రకాల సేవలను అందించామన్నారు. కరోనాతో మరణించిన చాలా మందికి అంత్యక్రియలు చేశామనా న్నరు. మానవ సేవే మాదవ సేవ అని భావించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎరికైనా ఎవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలియచేశారు.

## షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి భక్తురాలు విరాళం

**ఓబుళదేవరచెరువు, మార్చి 3, ప్రభాతవార్త**



విరాళం అందచేస్తున్న రమణమ్మ

మండలంలోని వెంకటాపురం పంచాయితీ నల్లగుట్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయానికి అదే గ్రామానికి చెందిన సాతర్ల రమణమ్మ లక్షరూపాయలు విరాళం ఇచ్చారు. సోమవారం ఈ విరాళాన్ని గ్రామపెద్దలకు ఇచ్చి షిర్డీ సాయిపై తనకు ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాతర్ల రమణమ్మను శాలువలు కప్పి సన్మానించారు.

## భక్తిశ్రద్ధలతో అక్కమ్మగార్ల నెల పూజ కార్యక్రమం



ఆలయ కమిటి సభ్యులు, నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, మార్చి 03 ప్రభాతవార్త**



గుడి వద్ద భక్తుల కోలాహలం

అనంత రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీలోని శ్రీ అక్కమ్మ గార్ల నెల పూజ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్కమ్మగార్ల నెల పూజ సందర్భంగా సోమవారం గ్రామంలోని ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అక్కమ్మ గార్ల ను దర్శించుకుని అమ్మవార్ల ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అక్కమ్మ గార్ల పరష సందర్భంగా భక్తులకు అన్నదానం చేసిన రాచనాపల్లి ఎంపీటీసీ 1 కృష్ణారెడ్డి, టిడిపి బిల్లా నాగరాజు, పుత్త ఎర్రి స్వామి , బుల్లెట్ రఫీలను ఘనంగా సన్మానించారు. అనంతరం అక్కమ్మ గార్ల దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు.

## 104 మొబైల్ వైద్య సేవ పాయింట్లు మార్చాలి

**ఓబుళదేవరచెరువు, మార్చి 3, ప్రభాతవార్త**

104 మొబైల్ వైద్య సేవల పాయింట్లు మార్చాలని మండలంలోని గౌనిపల్లికి చెందిన సామాజిక సేవకుడు మల్లెల రమేష్ సోమవారం పుట్టపర్తిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాడు. ప్రతి నెలా రెండవ గురువారం అల్లాపల్లిలో, ప్రతి నాల్గవ శుక్రవారం చౌడంపల్లిలో మొబైల్ పాయింట్లు ఏర్పాటు చేశారన్నారు. అల్లాపల్లి, చౌడంపల్లికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అల్లాపల్లి పాయింట్‌ను గౌరవురంకు, చౌడంపల్లి పాయింట్‌ను గౌనిపల్లికి మార్చితే ప్రజలకు సౌకర్య వంతంగా ఉండడమే కాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్‌కు వివరించినట్లు రమేష్ తెలిపాడు.

## ఆటో ప్రమాదంలో మహిళ మృతి

**ముదిగుబ్బ, మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని సంకేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఆటో ప్రమాదంలో భారతి (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా వున్నాయి. నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భారతి తన కుమార్తెను చూసేందుకు కదిరికి ఆటోలో వెళుతుండగా సంకేపల్లి వద్దకు రాగానే ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వస్తూ డివైడర్‌ను ఢీ కొనడంతో ఆటో ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ సంఘటనలో ప్రయాణిస్తున్న భారతి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన మహిళను పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె భర్త గంగాద్రికి విషయం తెలియచేశారు. ఆమెకు కుమార్తె ఉదయలక్ష్మి వుంది.

06ATP27_06ATP27.qxd 03-03-2025 PM 10:37 Page 1



## బాల్య వివాహాలు చేసి అనర్థాలు కొని తెచ్చుకోవద్దు

### మహిళా దినోత్సవంలో వక్తలు

**బత్తలపల్లి, మార్చి 3 ప్రభాతవార్త**

చిన్న వయసు లో ఉన్న పిల్లలకు పెళ్లిళ్లు చేసి అనర్థాలు కొని తెచ్చుకోవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఐసిడి ఎస్ ఆధ్వర్యంలో కోడకండ్ల గ్రామం లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడితూ తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలను భారంగా తలంచి చిన్న వయసులోనే వివాహాలు జరిపిస్తుంటారని, దానివలన శారీరకంగా మానసికంగా సమస్యలు ఎదురవుతాయి అన్నారు. కిశోర బాలికలను తమ మగ పిల్లల మాదిరే చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో మగవారితో సమానంగా మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని, స్త్రీ శక్తి ఏమిటో సమాజానికి తెలియజేస్తున్నారన్నారు. మహిళలంటే చిన్నచూపు తగ్గదని, మహిళగా పుట్టినందుకు గర్వించాలన్నారు. అనంతరం మొక్కలు నాటి వాటికి పేర్లు పెట్టారు. గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రమ్మ, కోడెకండ్ల సెక్టార్ అంగన్వాడి వర్కర్లు, తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలని నిరసన..!

**మడకశిర టౌన్ మార్చి 3 ప్రభాతవార్త,**

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి మడకశిర తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పెద్దన్న మాట్లాడుతూ: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు అదేవిధంగా హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి అన్ని చెరువులకు సాగనీరు అందించాలన్నారు పాడి రైతులకు లీటర్ పాలకు పది రూపాయలు ప్రోత్సాహం అందించాలన్నారు పరిశ్రమలు ఏర్పాటుకు సేకరించిన సేజ్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతు కుటుంబాల్లో పిల్లలకు ఉపాది అవకాశాలు కల్పించాలన్నారు. రైతులకు ఉచితంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను అందించాలన్నారు అదేవిధంగా వ్యవసాయ రంగానికి పగటి సమయంలో 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సి కొడిగే పల్లి ఖికేతేపల్లి గ్రామాల రైతులు సాగు చేసిన పంటలకు సాగు పత్రాలు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కరుణాకర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి , వైసీపీ నాయకుడు వెంకట రంగారెడ్డి . కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, రైతు సంఘం నాయకులు సిఆర్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు నా భూషణ్ రెడ్డి, మడకశిర రైతు సంఘం అధ్యక్షుడు సోమశేఖర్, హనుమంతరాయప్ప, వేమారెడ్డి, రైతులు ,తదితరులు పాల్గొన్నారు ,

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలి

### వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్

**ధర్మవరం మార్చి 3 ప్రభాతవార్త,**


సాయికుమార్ ఫైల్ ఫోటో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ సీఎం చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని వైఎస్ఆర్సీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్ డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ వాళ్లకు ప్రభుత్వపరంగా ఏదైనా సహాయం, ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లే నని సీఎం హోదాలో ఉండి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు ప్రజల పట్ల ఎటువంటి పక్షపాతం లేకుండా రాగద్వేషాలకు తావు లేకుండా అందరికీ సమానంగా న్యాయం చేస్తానని ప్రమాణం చేసిన చంద్రబాబు ఇప్పుడు వైసీపీ కార్యకర్తలపై ఈ విధంగా ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం పట్ల నిజంగా సీఎం చంద్రబాబు నాయుడు గౌరవం ఉన్నట్లయితే ప్రజలందరినీ సమానంగా చూసి సంక్షేమ పథకాలు కూడా అమలు చేయాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, మరియు బైబిల్ లాగా భావించి అన్ని సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందించారు. నాలుగో సారి ముఖ్యమంత్రిగా పని చేస్తున్న చంద్రబాబు నాయుడు ఈ విధంగా మాట్లాడటాన్ని భారత రాష్ట్రపతి సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరారు.

## కార్యకర్తలకు ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలి

### సికేపల్లి టిడిపికార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో కన్వీనర్ ముత్యాల రెడ్డి..

**చెన్నేకొత్తపల్లి, మార్చి, 03(ప్రభాతవార్త**


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి

గ్రామాల్లో కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలని, టిడిపి మండల కన్వీనర్, ముత్యాల్ రెడ్డి, అన్నారు , సోమవారం, చెన్నె కొత్తపల్లి మండల కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో, మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కన్వీనర్ ముత్యాల రెడ్డి మాట్లాడుతూ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం చెన్నెకొత్తపల్లి, మండల, కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు, కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చిన గ్రామస్థాయి నాయకులు వెంటనే పరిష్కరించాలన్నారు ఏ ఒక్క కార్యకర్త కూడా ఆఫీస్ చుట్టూ తిరగకూడదని ప్రతి గ్రామంలో నాయకులు వారి సమస్యలను, వెంటనే, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసు కోవాలన్నారు, ప్రతి ఒక్క నాయకుడు వీటిపై దృష్టి పెట్టాలని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమరేంద్ర, మాజీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాడెం సూర్యనారాయణ రెడ్డి, హరినాథ్ రెడ్డి, వడ్డే దుర్గ, అమరేందర్ రెడ్డి, కాన శివారెడ్డి, శ్రీనివాసులుచెన్నకేశవ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**కనగానపల్లి మార్చి 3 ప్రభాతవార్త**


తహసిల్దార్ జీవి ప్రసాద్ కు వినతి పత్రం ఇస్తున్న కదిరప్ప

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం నందు సోమవారం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సిపిఎం మండల కార్యదర్శి కదిరప్ప తహసిల్దార్ జీవి ప్రసాద్ కు వినతిపత్రం అందించారు. కదిరప్ప మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పంటలకు గిట్టుబాటు ధర బీమా సౌకర్యం కల్పించాలని రైతులకు పగటిపూట కరెంటు ఇవ్వాలని పాడి పశువులకు ఉచితంగా ఇన్సూరెన్స్ అలాగే ప్రోత్సాహకాలు అందించాలని డ్రిప్పు, స్ప్రింక్లర్లకు జీఎస్టీ రద్దుచేసి రైతులకు 90 సబ్సిడీతో అందించాలని చుక్కల భూమి తో సహా సాగులో ఉన్న బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## చెవులను శబ్దాల నుండి రక్షించుకోవాలి

### జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

**శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము మార్చి 3 ప్రభాతవార్త**



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

చెవికి సంబంధించిన అనారోగ్య సమస్యలకు వెంటనే చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ర్యాలీ జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జెండా ఊపి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు వృద్ధులు వినికిడి లోపాలకు గురవుతుంటారని శబ్దాలు పెద్దగా వినడం వల్ల వినికిడి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అలా వినికిడి లోపాలు ఉంటే కాక్లియర్ ఇంప్లాంట్ లాంటి ఆధునిక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వీటిని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యంగా పిల్లల్లో వినికిడి లోపాలను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. స్విమ్మింగ్ కు వెళ్ళినప్పుడు చెవులను కప్పుకోవాలని తెలియజేశారు. తదనంతరం ఎనుములపల్లి పీ హెచ్ సి నుండి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలోఆర్ బి ఎస్ కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నివేదితగారు జిల్లా టీ బీ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సునీల్ , మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మూగజీవాల మేతకు జొన్న విత్తనాల పంపిణీ

**అగళి మార్చి 3 ప్రభాతవార్త**


జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న జడ్పిటిసి

రైతులు తాము సాకుతున్న మూగ జీవాల మేత కోసం సాగు చేసుకోవడానికి జొన్న విత్తనాలను జడ్పిటిసి ఉమేష్ రైతులకు సోమవారం వెటర్నరీ కార్యాలయం ముందు పంపిణీ చేశారు కూటమి ప్రభుత్వం ఎప్పుడు రైతుల గురించి ఆలోచిస్తుందని జడ్పిటిసి అన్నారు ఈ పంపిణీ కార్యక్రమంలో వెటర్నరీ ఉద్యోగి శివకుమార్ టిడిపి నాయకులు భూతరాజు కరియన్న జయరాం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

## బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం

**అగళి మార్చి 3 ప్రభాతవార్త**


బాల్య వివాహాలపై మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ శాఖవారు రోజుకో కార్యక్రమాన్ని చేస్తున్నారు అందులో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన అనే కార్యక్రమం పై బస్టాండ్ ప్రాంతంలో ప్రధానోపాధ్యాయులు వరదరాజులు ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు పాఠశాల విద్యార్థినులు బస్టాండ్ ప్రాంతంలో మానవ హారంగా ఏర్పడి అవగాహన కల్పించారు నాలుగున ఆరోగ్యకరమైన మహిళలు సంతోషకరమైన మహిళలు అనే అంశంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు ఐదున కౌమార బాలికలకు క్యారీర్ అవకాశాలు అనే అంశంపై 6న మహిళా అక్షరాస్యత ప్రపంచ సవాళ్లు అవకాశాలు అనే అంశంపై 7న మహిళా హక్కులు చట్టంపై అవగాహన 8న 1098 181 అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు

## ఇంటర్ విద్యార్థులకు శుభవార్త

**ధర్మవరం రూరల్ మార్చి 3 ప్రభాతవార్త**

ఇంటర్మీడియట్ ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం చదువుతూ పరీక్షల రాస్తున్న విద్యార్థులకు పి వీ కేకే ఇంజనీరింగ్ కళాశాల వారు శుభవార్త అందించారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత ఎంసెట్ శిక్షణ తీసుకొని ఎంట్రెన్స్ రాయడానికి మార్చి 25 నుండి మే 5వ తారీఖు వరకు హాస్టల్ వసతితోపాటు ఉచిత ఎంసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు ధర్మవరం శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముసలి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సాహవంతులైన విద్యార్థులు మార్చి 22 సాయంకాలం 3 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

## ఘనంగా మహిళా అంతర్జాతీయ దినోత్సవం

**గుడిబండ మార్చి 3 ప్రభాతవార్త**


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోని ఐసిడిఎస్ కార్యాలయం లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలకు మద్దన కుంట గ్రామానికి చెందిన బిటెక్ విద్యార్థి తరుణ్ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కమలమ్మ, గుడిబండ ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గుణరావు, బంగారు లింగప్ప, అంగన్వాడీ కార్యకర్తలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## గుడిబండ విద్యుత్ ఏఈగా విశ్వనాథం

**గుడిబండ మార్చి 3 ప్రభాతవార్త**


ఎఈ విశ్వనాథం కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మండల విద్యుత్ ఏఈ గా జి విశ్వనాథం నియమింతులయ్యారు. ఈయన గాండ్లపెంట మండలం నుండి బదిలీ వచ్చారు. ఇంతకు ముందు ఎఈగా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్ మడకశిర మండలానికి బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా విశ్వనాథం సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యుత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు, రైతులకు విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడి రఘు, మడకశిర ఎఈ విశ్వనాథ్, ఎల్ఐ ఈరన్న, ఫోర్ మాన్ లింగప్ప, లైన్ మాన్లు బల్లేకట్ట రామకృష్ణ, రఘునాథ్, మూడ్లగిరియప్ప, చిక్కతిమ్మప్ప, మహేంద్ర, భోజరాజు, హనుమంతరాయప్ప, మురళీకృష్ణ తదితర విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 7 నుంచి ప్రారంభమయ్యే రైతుల పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

### -10న కలెక్టర్ ఆఫీస్వద్ద ధర్నాను జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

**ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త**


రైతుల పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లలో ఈనెల 7వ తేదీ ఉరవకొండ నుండి ప్రారంభమయ్యే రైతుల పాదయాత్ర పోస్టర్లను సోమవారం వజ్రకరూరు మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి మాట్లాడుతూ పాదయాత్ర ముగింపు సందర్భంగా 10వ తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం జరుగుతుందని రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతులు లక్షలాది రూపాయలు అప్పులుచేసి సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర లభించడంలేదని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే అన్ని పంటలకు కొనగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అతివృష్టి, అనావృష్టివల్ల 2024-25 ఖరీఫ్, రబీ పంట కాలాల్లో నష్టపోయిన పంటలకు పరిహారం, బీమా వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వమే మిరప డబ్బీరకం, కడ్డీ రకానికి క్వింటా 50వేలతో, సింజెంటా, ఇతర రకాల మిరపను క్వింటాల్ 25వేలతో కొనగోలు చేయాలన్నారు. సీడ్ జొన్నలకు క్వింటా 5వేలు మద్దతు ధర ప్రకటించి, కంపెనీలు దళారులు లేకుండా రైతులతో నేరుగా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని, పప్పుశెనగ కొనగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి క్వింటా 10వేలతో కొనగోలు చేయాలని, షరతులు లేకుండా క్వింటా పత్తి 10వేలతో కొనగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఓబులపతి, షేక్షావలి, సుధాకర్, నాగన్న, శివ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సత్యసాయి సేవా సంస్థల పూర్వ అధ్యక్షులు నలబాల అంజినయ్య మృతి

### -ఘనంగా నివాళులర్పించిన జాతీయ, ఏపీ, తెలంగాణ ప్రాంత సత్యసాయి సంస్థల ప్రతినిధులు

**ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త**


మృతి చెందిన సత్యసాయి సేవా సంస్థల పూర్వ అధ్యక్షులు డాక్టర్ నలబాల అంజినయ్య భౌతిక కాయం


డాక్టర్ నలబాల అంజినయ్య (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ పట్టణానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థల పూర్వ అధ్యక్షులు, సత్యసాయిబాబా భక్తులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నలబాల అంజినయ్య (92) అనారోగ్యంతో మృతి చెందారు. వయసు రిత్యా వచ్చే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో గుంతకల్లు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య దేవాక్షమ్మ ఇదివరకే మరణించి ఉండగా నలుగురు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. డాక్టర్ నలబాల అంజినయ్య గత 2002 నుండి 2010 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్యసాయి బాబా దివ్య చరితం ప్రచార ం, సత్యసాయి సేవా సంస్థల ఆవిర్భావం, నియమ నిబంధనల గూర్చి విస్తృతంగా ప్రచారం చేశారు. ఉరవకొండలో బాల సాయిబాబా మందిరం, గురుచరణ భజన మందిరాల నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. సోమవారం ఆయన భౌతిక కాయాన్ని ఉరవకొండకు తీసుకొచ్చి స్థానిక ఇండేన్ గ్యాస్ కార్యాలయంవద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయన భౌతిక కాయాన్ని సత్యసాయి సేవా సంస్థల జాతీయ సేవాదల్ కోఆర్డినేటర్లు కోటేశ్వరరావు, శశిబాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ రామచంద్రమూర్తి, సత్యనారాయణమూర్తి, సత్యసాయి భజనల జిల్లా కో ఆర్డినేటర్ శంకర్నారాయణ, జిల్లా సేవాదల్ కో ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, ఆధ్యాత్మిక విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ శైలజ, బాల వికాస్, మహిళా విభాగం కో ఆర్డినేటర్ గీత సుకుమార్, అభయ ఫౌండేషన్ ఛైర్మెన్ బాలచంద్ర, అనంతపురం నగర కన్వీనర్ నరసింహప్ప, ఉరవకొండ సేవా సమితి అధ్యక్షులు దాశెట్టి రామాంజినేయులు తదితరులు, సత్యసాయి భక్తులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

## నేడు 10వ తరగతి పరీక్షల నిర్వహణపై ఓరియంటేషన్ ప్రోగ్రాం.

**కొత్తచెరువు మార్చ్ 3 ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లా బుక్కపట్నం డైట్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ నెల 17న జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మరియు ఓపెన్ టెన్త్ పరీక్షలు నిర్వహణపై చీఫ్ సూపరిండెంట్స్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ కు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించబడునని జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యాముల్ హాజరుకానున్నారనీ తెలపారు

## ఘనంగా అదిలాబాద్ భక్తుల గ్రామోత్సవం

**పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:**


గ్రామోత్సవంలో జెండాలతో యువకుల కేరింతలు

పుట్టపర్తి పురవీధులలో ఆదిలాబాద్ భక్తుల గ్రామోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. సోమవారం ఉదయం పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుండి గణేష్ గేట్ వరకు ఈ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి చిత్రపటాన్ని వెండి రథంలో ఉంచి రంగురంగు పుష్పాలతో అలంకరించారు. రథం ముందు అదిలాబాద్ కు చెందిన బాల వికావికాస్ విద్యార్థులు కోలాటం, కలిశ ప్రదర్శన, బతుకమ్మ, వారి సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. యువకులు పెద్ద ఎత్తున జెండాలను చేత పట్టుకొని వాయిద్యాలకు అనుకూలంగా నృత్యం చేశారు. అదిలాబాద్ నుంచి పవిత్ర పర్తియాత్రగా పుట్టపర్తికి విచ్చేసిన భక్తులతో పుట్టపర్తి పురవీధులు భక్తులతో కిటికీటలాడాయి. ఈ కార్యక్రమంలో దేశ విదేశీ భక్తులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధమే హత్యకు కారణం

### హత్య కేసులో ఇద్దరు ముద్దాయిల అరెస్ట్

### కేసు చేదింపులో కీలకంగా వ్యవహరించిన డాగ్ స్క్వాడ్


మాట్లాడుతున్న డిఎస్పి విజయ్ కుమార్

**పుట్టపర్తి టౌన్, మార్చి 3, ప్రభాతవార్త**

పుట్టపర్తి రూరల్ మండలం పరిధిలోని వెంగళమ్మ చెరువుకు చెందిన చియ్యేటి నగేష్ దారుణ హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు పుట్టపర్తి డి.ఎస్.పి విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తి డిఎస్పి కార్యాలయంలో డీఎస్పీ విజయ్ కుమార్, రూరల్ సీఐ బిఎన్. సురేష్, ఎస్సై లింగన్న, బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తిలతో కలసి కేసు వివరాలను వెల్లడించారు. వెంగళమ్మ చెరువుగ్రామం బుడ్డన్నగారికుమారుడు బుడ్డన్నగారి దివాకర్(21), వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన చియ్యేటి సునీత (30) హత్య కేసు విషయంలో హతుడు నగేష్ తమ్ముడు చియ్యేటిగణేష్ ఇచ్చిన ఫిర్యాదుతో జిల్లా ఎస్పీ వి. రత్న ఆదేశాలతో పోలీసులు పకడ్బందీగా విచారణ చేయడం, డాగ్ స్క్వాడ్ దయానా కీలకమైన ఆధారాలను పసికట్టి పోలీసులకు కేసు చేదింపు, దర్యాప్తులో కీలకంగామారింది. పోలీస్ విచారణలో బుడ్డన్నగారి దివాకర్, చియ్యేటి సునీతఇంటికివస్తూపోతూ ఆమెతో అక్రమసంబంధం పెట్టుకుని, తరచూ ఫోన్లో వీడియో కాల్ మాట్లాడుకుంటున్న విషయం తెలిసిన సునీత భర్త చియ్యేటి నగేష్ భార్యను దండించినందున అతనిపై కక్ష పెట్టుకుని ఎలాగైనా భర్తను వదిలించుకోవాలనే ఉద్దేశంతో దివాకర్తోకలిసి ఫిబ్రవరి 28న హత్యకు పథకంవేసి, నగేష్ ను దివాకర్ తన ద్విచక్ర వాహనంలో కర్ణాటక నాగేపల్లి గ్రామ శివారులో ఉన్న బ్రాందీషాప్లో రెండు బీరుబాటిల్ తీసుకొని, వీరాంజనేయ పల్లి గ్రామ శివారు వద్ద గల మామిడి చెట్టు కింద నగేష్ కు మద్యం తాపించి, విచక్షణారహితంగా నరికి హత్య చేశాడని, పోలీస్ విచారణలో తెలిసింది. ఈ కేసు చేదింపులో డిఎస్పి విజయ్ కుమార్, సిఐ సురేష్ తమ ఎస్సై లతో కలిసి కేసును త్వరగా చేదించారు. హత్యలో ఇతరులు ఎవరైనా పాల్గొన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగించి, ఖచ్చితమైన నిర్ధారణతో ముద్దాయిలను సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసులో మొదటి ముద్దాయి దివాకర్ ను కర్ణాటక నాగేపల్లి సర్కిల్ వద్ద ఉదయం 11:30 గంటలకు అరెస్ట్ చేసి, ముద్దాయి వాంగ్మూలం తో భర్తను హత్య చేయమని పథకం వేసిన సునీతను మధ్యాహ్నం 2.30 గంటలకు ఆమె ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు చేదింపులో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్పి, సిఐ, ఎస్సైలను, డాగ్ స్క్వాడ్ దయానాను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

## నూతన కమిటీకి ఎంపికైన అమరాపురం నాయకులు

**అమరాపురం మార్చి 3 ప్రభాతవార్త**


నాయకులు దృశ్యం

శ్రీ సత్యసాయి జిల్లా నూతన అధ్యక్షులుగా పెనుకొండ రామకృష్ణ చౌదరిని నియుక్తి చేయడం జరిగినది. నంద్యాలలో జరిగినదక్షిణ ప్రాంత విస్తృత సమావేశంలో జిల్లా కార్యదర్శిగా ఉన్న అమరాపురం గోసాయి హరి ప్రసాద్ ని ప్రాంత సత్సంఘ్ సహ ప్రముఖ్ గా నియుక్తీ చేయడం జరిగినది. జిల్లా భజరంగ్ దళ్ సంయోజక్గా సేవలందించిన నవీన్ కుమార్ ని అనంతవిభాగ్ భజరంగ్ దళ్ సంయోజక్గా నియుక్తి చేయడం జరిగినట్లువారు తెలిపారు. జిల్లా సహ కార్యదర్శి హారేసముద్రం నరేంద్ర కుమార్ కి జిల్లా కార్యదర్శి బాధ్యతలు ఇవ్వడం జరిగినది. భజరంగ్ దళ్ సహ సమయోజక్ గా వున్న మురళీ మోహన్‌రెడ్డిని జిల్లా భజరంగ్ దళ్ సంయోజక్ గా బాధ్యతలు ఇవ్వడమైనది. కదిరి ప్రఖండ అధ్యక్షులు గా వున్న మధుసూదన్ రెడ్డిని జిల్లా ధర్మ ప్రసార ప్రముఖ్ గా, వీరితో పాటు కదిరిశ్రీ సాయి కి జిల్లా భజరంగ్ దళ్ సహ సంయోజక్ బాధ్యతలు ఇవ్వడం జరినట్లు వారు తెలిపారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ.

**కనగానపల్లి మార్చి 3 ప్రభాతవార్త**


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు మనోహర్ బాబు, శ్రీనివాసులు.

మండల కేంద్రంలో సోమవారం మోడల్ స్కూల్ విద్యార్థులు 22 మందికి జిల్లా పరిషత్ హై స్కూల్ 5 మంది విద్యార్థులకు కేజీబీవీ స్కూల్ 19 విద్యార్థినిలకు దృష్టిలోపం ఉన్న వీరందరికీ ఉచితంగా కంటి అద్దాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీ డాక్టర్ భాను రేఖ మాట్లాడుతూ విద్యార్థులు ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు ఉన్న ఆహారం తీసుకోవాలని ఇలాంటి ఆహారం తీసుకుంటే కంటి సమస్యలు రాకుండా నివారించగలవని విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ మనోహర్ బాబు, హెల్త్ సూపర్ వైజర్ ఎం. శ్రీనివాసులు, స్టాఫ్ నర్స్ విక్టోరియా, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవి కిరణ్, హై స్కూల్ హెచ్ఎం లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా నిర్మూలన పోస్టర్లు విడుదల చేసిన ఆర్డిఓ

**పెనుకొండ మార్చి 3 ప్రభాతవార్త**


పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

నాటుసారా నిర్మలన ముద్రించిన పోస్టర్లను ఆర్డీవో ఆనంద్ కుమార్ విడుదల చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో కలిసి పోస్టర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు ఇందుకోసం ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు నాటు సారా తయారీ విక్రయ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు . కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సృజన బాబు ఎస్ఐలు రాజశేఖర్ రాముడు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు

**ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త**

కూడేరు మండలం కమ్మూరు గ్రామంవద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జంగం సరస్వతి, 3 నెలల పసికందు విద్యశ్రీ అంత్యక్రియలు సోమవారం ఉరవకొండ మండల పరిధిలోని రాయంపల్లి గ్రామంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం ఇరువురి మృతదేహాలను మధ్యాన్నం స్వగ్రామంకు తీసుకొచ్చారు. మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే సరస్వతి భర్త సతీష్, ఏడాదిన్నర వయసుగల కుమార్తె జోత్స్న, ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇంటివద్ద ఉంచిన ఇరువురి మృతదేహాలను పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి సందర్శించి నివాళులర్పించారు. ప్రమాదంలో మరణించిన పసికందును చూసినవారందరూ అయ్యో భగవంతుడా ఎంతపని చేశావయ్యా అంటూ కంటతడి పెట్టడం కనిపించింది.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ...

రాయదుర్గం, మార్చి 03 ప్రభాతవార్త:



విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేస్తున్న కాలవ భరత్, మంజునాథగౌడ్

పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్‌గౌడ్‌లు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. సోమవారం శ్రీరామ్‌పౌండేషన్ అనూష, ఆంజి ఆధ్వర్యంలో ద్వారక మాయి క్లినిక్ కటారు పశుపతినాథరెడ్డి, డాక్టర్ యువచంద్రిక, బిపిటి వారి సహకారంతో పదవ తరగతి పరీక్షా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్యఅథితులుగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరామ్ పౌండేషన్ సంస్థ అధ్యక్షురాలు ఒక మహిళ అయ్యిండి కూడా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలకు, యువతకు ఆదర్శంగా నిలుస్తూ ఇంతటి బహుగొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రతి సమస్యకు తన అండ దండలు అందిసూనత సమాజ సేవలకు ప్రోత్సహిస్తున్న ద్వారక మాయి క్లినిక్ కి అభినందనతు తెలియజేశారు. విద్యార్థులు రాసే పరీక్షలలో ఉత్తీర్ణత ర్యాంకు సాధించాలని, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామాంజినేయులు, ఖాసీం, పాఠశాల యాజమాన్యం, సేవా భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం డైరీ ఆవిష్కరణ.

రాయదుర్గం రూరల్, మార్చి 03 ప్రభాతవార్త:



డైరీని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు.

పట్టణ సమీపంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోనంకి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి చేతుల మీదుగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ డైరీలో అధ్యాపకులకు సంబంధించిన సర్వీస్ రూల్స్, జీఓలు ఉంటాయని, అధ్యాపకులకు ఈ డైరీ చాలా ఉపయుక్తంగా ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. అనంతరం సంఘ సభ్యులు కిరణ్ జక్కుల, బాల నరసింహులు, పరీసా ఫిర్దోష్‌లు పాల్గొని అధ్యక్షులు అధ్యాపకుల సమస్యల గురించి ప్రస్తావించారు. అనంతరం అర్థశాస్త్ర అధ్యాపకులైన కోనంకి శ్రీధర్ డిగ్రీ బిఏ అర్థశాస్త్ర అధ్యయన విద్యార్థిని విద్యార్థులకు బడ్జెట్ విషయపరంగా అతిథి ఉపన్యాసం ఇచ్చి విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాల నరసింహులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కే.లక్ష్మినారాయణ, బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులను సత్కరించారు.

## వాహనాల తనిఖీ

అగళి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఎస్ పి డి ఎస్ పి ఆదేశాల మేరకు అగళి ఎస్సై వీరేష్ వాహనాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇన్సూరెన్స్ చేయించాలని రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని తెలిపారు మద్యం సేవించి వాహనాలను నడప రాదని తెలిపారు వీరి వెంట ఏఎస్ఐ బషీర్ ఉన్నారు.

## ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

అగళి మార్చి 3 ప్రభాతవార్త

ఆవలి ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జాఫర్ తెలిపారు 2025 26 సంవత్సరానికి గాను ఆదర్శ పాఠశాలలో 100 సీట్లు ఉన్నాయని దరఖాస్తులు చేసుకోవడానికి పాఠశాలలో సంప్రదించాలన్నారు.

## వడదెబ్బ మరియు దోమల నియంత్రణ పై అవగాహన సదస్సు

రాయదుర్గం రూరల్, మార్చి 03 ప్రభాతవార్త:



అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్

ఎండలు పెరిగిపోతున్నాయి కావున ప్రతి ఒక్కరూ వడ దెబ్బ నుంచి రక్షణ పొందడానికి కొన్ని .ఆగ్రత్తలు తీసుకోవడం అవసరమని మరియు పరిసరాలు శుభ్రముగా ఉంచుకోవడం వల్ల దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు. మండల పరిధిలోని వేపురాళ్ళ గ్రామంలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నియంత్రణ మరియు వడ దెబ్బ గురించి అవగాహన కల్పించారు. కాల్వలో లార్వా నియంత్రణకు అబేట్ ను పిచికారి చేయించారు. తొట్టెలో లార్వా ను గుర్తించి పారబోయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల పుట్టకుండా వారినికి ఒకసారి నీటిని పారబోసి డ్రై డే పాటించాలని, కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటము వల్ల వడ దెబ్బ కు గురి అయ్యే ప్రమాదము ఉందని కావున చల్లని ప్రదేశాల్లో ఉండటానికి ప్రయత్నించాలని, ఎండలో గొడుగును ఉపయోగించాలని, పలచని, వదులుగా ఉండే కాలన్ దుస్తులు ప్రత్యేకించి తెల్లవి దుస్తులను ధరించాలన్నారు. కాటన్ టోపిని లేదా తలపాగాను ధరించాలి. రోజుకు 15 గ్లాసులు నీళ్ళు త్రాగాలి, పల్ల రసాలు, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. మధ్యహ్నం 12-3 గంటలు మధ్య బయట చేసే పనులు చేయకండి, ఒకవేళ తప్పనిసరై చేయాల్సి వస్తే తేలిక పాటి పనులు చేయాలి. వడదెబ్బ లక్షణాలున్న మనిషిని చల్లని ప్రదేశానికి తరలించి, మంచు ముక్కలు వేసి ఈ నీటితో ముంచిన స్పాంజీతో రుద్దాలి, దుస్తులు తక్కువగా ఉండాలి. వడదెబ్బ తగిలిన మనిషిలో ఎలాంటి మార్పు లేకపోతే ప్రత్యేకించి శీతలీకరణ సౌకర్యంతో తక్షణమే ఆసుపత్రికి తరలించాలి. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం బసిరెడ్డి అచ్చమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఏషన, హెల్త్ అసిస్టెంట్ నరసింహ, ఆషా కార్యకర్తలు శకుంతలమ్మ, అంజలి పాల్గొన్నారు.

## సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

గుత్తి, మార్చి 3 ప్రభాతవార్త



విద్యార్థులను తనిఖీ చేసిన దృశ్యం

గుత్తి మున్సిపాలిటీలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సజావుగా కొనసాగాయి. ఈ సందర్భంగా మోడల్‌స్కూల్, ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల, మహాత్మ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈ మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

## బాల్య వివాహాలు చేసి పిల్లల భవిష్యత్తును పాడుచేయొద్దు

-పి.కౌకుంట్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ

ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ

తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేసి వారి భవిష్యత్తును పాడుచేయవద్దని హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ అన్నారు. పి.కౌకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యు.వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ, పీసీ పీఎన్‌డీటీ చట్టం గుర్చి వివరించారు. ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్ళిళ్ల చేయడంవల్ల వారు అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడంతోపాటు చదువుకు దూరమవుతారన్నారు. ఆడపిల్ల భారమన్న భావనను ప్రతిఒక్కరూ విడనాడాలని, ఆడ, మగ ఇద్దరు సమానమేనని ఇద్దరినీ బాగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ గోవిందు, పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య, ఆరోగ్య సహాయకులు నాగరాజు, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ చందన, అంగన్‌వాడీ కార్యకర్తలు రబియా, మల్లేశ్వరి, నాగవేణి, ఆశ కార్యకర్తలు సువార్త విరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని కచ్చితంగా వినియోగించుకోవాలి

-ఓడీఎఫ్ గ్రామాల సందర్శనలో వజ్రకరూరు ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి, ఏఈ మంజునాథ్

ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న వజ్రకరూరు ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి, ఏఈ మంజునాథ్ సిబ్బంది

ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని వాటిని కచ్చితంగా వినియోగించుకోవాలని వజ్రకరూరు ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ ఏఈ మంజునాథ్ కోరారు. సోమవారం వారు మండలంలోని ఓడీఎఫ్ గ్రామాలైన నింబగల్లు, నెరమెట్లలో పర్యటించి మరుగుదొడ్లను పరిశీలించి వ్యక్తిగత మరుగుదొడ్లను వినిగించుకోవడంవల్ల చేకూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో రిక్షాల ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను వేరుగా ఎస్‌డబ్ల్యూపీసీల్లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శిల్ప, మహేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున, ఇంజనీరింగ్ అసిస్టెంట్ క్రిష్ణ, సాయి, డిజిటల్ అసిసె ంట్ అహమ్మద్, స్వచ్ఛభారత్ ఉరవకొండ, వజ్రకరూరు మండల కో ఆర్డినేటర్లు జయప్రకాష్‌గౌడ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా మరో ఓడీఎఫ్ గ్రామమైన మండల పరిధిలోని రేణిమాకులపల్లి గ్రామంలోనే వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై తనిఖీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదరి ్శ బాల వెంకటేష్, విడపనకల్లు ఏఈ ముజాముల్లా, విడపనకల్లు ఎంసీఓ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువులన్నింటికీ వ్యాధి నిరోధక టీకాలు వేయండి

-పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డీడీ డాక్టర్ జి.వెంకటేష్

ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త



రాకెట్లలో టీకాల రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డీడీ డాక్టర్ జి.వెంకటేష్

పాడి పశువులన్నింటికీ గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని పశుసంవర్ధకశాఖ ఉరవకొండ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో జరుగుతున్న టీకాలు వేసే కార్యక్రమాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీ డాక్టర్ జి.వెంకటేష్ మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయించడంవల ్ల కలిగే ప్రయోజనాలను పాడి పశువులున్న రైతులకు వివరించాలన్నారు. గ్రామాల్లో ఎన్ని పశువులకు టీకాలు వేశారో రికార్డుల్లో కచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశు సంవసర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం

-రాకెట్ల తండాలో అవగాహన కార్యక్రమం

ఉరవకొండ, మార్చి 3 ప్రభాతవార్త



రాకెట్ల తండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ అన్నారు. మండల పరిధిలోని రాకెట్ల తండా గ్రామంలో సోమవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే దుష్ప్రభావాలు, నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ షఫీ మాట్లాడుతూ బాల్య వివాహాలవల్ల పిల్లల చదువులు పాడవుతాయని, ముఖ్యంగా ఆడపిల్లలు స్వేచ్ఛను కోల్పోయి ఇతరులపై ఆధారపడవలసి వస్తుందన్నారు. ఉపాధి అవకాశాలు సైతం దెబ్బతిని చిన్న వయసులోనే గర్భం దాల్చి శారీరక, మానసిక అనారోగ్యంతో బాధపడతారని, పుట్టిన పిల్లలు అనారోగ్యంతో పుడతారన్నారు. అనేకమంది పిల్లలు చనిపోవడం కూడా జరుగుతుందని వివరించారు. బాల్య వివాహాలు బాల్య వివాహాల నిరోధక చట్టం కింద నేరమని అబ్బాయి, అమ్మాయి తల్లిదండ్రులు, వివాహానికి హాజరైన వారందరిపై కూడా కేసు నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త సుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 188 మంది విద్యార్థులు గైర్హాజరు

కొత్తచెరువు మార్చి0 3 ప్రభాతవార్త.

శ్రీ సత్య సాయి జిల్లాలో ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి జిల్లాలో 7 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1309 విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 1121 మంది మాత్రమే విద్యార్థులు పరీక్ష కీ హాజరయ్యారు 188 మంది విద్యార్థులు పరీక్షకి గైర హాజరయ్యార నీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు.

## నిప్పు అంటుకొని పంట దగ్ధం..

డి.హీరేహాళ్, మార్చి 03 ప్రభాతవార్త:



దగ్ధమైన పంటను చూపుతున్న రైతు

డి.హీరేహాళ్ మండల పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామికి చెందిన ఆలసంద పంటకు నిప్పు అంటుకొని దగ్ధమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంట కోసిన తర్వాత రైతు పొలంలో ఒకచోట వామును ఏర్పాటు చేసుకున్నాడన్నాడు. దీంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పంటకు నిప్పు పెట్టారని బోరున విలపించాడు. పంట పూర్తిగా కాలిపోయిందని, దీంతో దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిలిందన్నాడు. అప్పులుచేసి పంట వేశానని, చేతికి వచ్చిన పంటను నోటికి రాకుండా చేశాడని ఆవేదనకు గురైయ్యాడు. ఈ ఘటనపై ఎర్రిస్వామి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## కొత్తగా మంజూరైన ఫించన్ పంపిణీ.

డి.హీరేహాళ్, మార్చి 03 ప్రభాతవార్త:



ఫించన్‌ను పంపిణీ చేస్తున్న ఎంపిపి పుష్పావతి

డి.హీరేహాళ్ మండల కేంద్రంలో కొత్తగా ఎన్టీఆర్ భరోసా డయాలసిస్ పేసెంట్‌కు మంజూరైన రూ.10వేలు ఫించన్‌ను సోమవారం మాజీ ఎంపిపి పుష్పావతి మరియు సర్పంచ్, పంచాయితీ సెక్రెటరీ మరియు తిప్పేస్వామి, సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ పేసెంట్ కు నూతనంగా ఎన్టీఆర్ ఫించన్ పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేశాడు. నాకు తెలుగుదేశం ప్రభుత్వం నూతన ఫించన్ మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన సంతోషం వ్యక్త పరిచాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాతిదూలం లాగుడు పోటీలకు నగదును అందజేసిన మండల కన్వీనర్

శెట్టూరు మార్చ్. 03. ప్రభాతవార్త



నగదు అందజేస్తున్న దృశ్యం

కొండదుర్రి మండలం వడ్డేపల్యా శ్రీ ఆంజనేయ స్వామి. జాతర సాధార్భముగా. నిర్వహించిన ఒంగోలు జాతి వృషబాల రాతి దూలం లాగుడు పోటీలను. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసినారు. శెట్టూరు మండల కన్వీనర్ బోయ నర్సింహులు రాతిదూలం లాగు పోటీలో గెలపొందిన బళ్లారికి చెందినటువంటి పుష్పాలకు రెండో బహుమతిగా 20వేల రూపాయల నగదును కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నగదును అందజేసిన బోయ నర్సింహులకు ఆలయ కమిటీ వారు ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలిపెట్టేది లేదు

సిపిఐ మండల కార్మిక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

తాడిమర్రి మార్చి 3(ప్రభాత వార్త)



ధర్నాకు బయలుదేరిన మండల సిపిఐ నాయకులు

పేదలకు సొంతింటి కల సహకారం చేసుకోవడానికి ఈరోజు (సోమవారం) పుట్టపర్తిలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి తాడిమర్రి మండలం నుంచి నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. మండల కార్మిక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలానికి కేటాయించి ఇల్లు నిర్మించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, పోతలయ్య సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య...

రాయదుర్గం, మార్చి 03 ప్రభాతవార్త:



ఆత్మహత్య చేసుకున్న యువకుడు.

పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలో ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంకాలం ఓ ఇంట్లో దురువాసన వస్తుండటంతో అనుమానం వచ్చి స్థానికులు వెళ్లి చూడగా ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమ్మితం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించాడు. మృతుడు హరిజన శ్రీనివాసులుగా(36) గుర్తించారని, ఈయన బేల్దారి పనిచేసుకుంటూ జీవనం కొనసాగించే వాడన్నారు. భార్య పుట్టినిలైన కర్ణాటకలోని మోకా వద్ద ఉంటూ భార్య, పిల్లలను చూసుకుంటుండేవాడని, వారం రోజుల క్రితం రాయదుర్గంకు వచ్చాడన్నారు. గురువారం సాయంకాలం ఒకసారి కనిపించాడని అక్కడ ఉన్న స్థానికులు తెలిపారు. ఆ తర్వాత కనిపించలేదన్నారు. రెండు, మూడు రోజుల క్రితమే ఉరివేసుకున్నట్లు స్థానికులు, పోలీసులు బావిస్తున్నారు.

## నాటుసారా అనర్థాలపై అవగాహన

గుంతకల్లు, మార్చి 3 ప్రభాతవార్త



గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కదిరిపల్లి గ్రామంలో నాటుసారా అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి గ్రామస్తులకు వివరించారు. అలాగే నాటుసారా తయారు చేసినా క్రయ, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రజల చేత సారాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమీషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామి, ఎక్సైజ్ సిఐ శివసాగర్, గుత్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు డిప్యూటి తహశీల్దార్, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వాస్తవాలు విచారించి చట్ట పరిధిలో న్యాయం చేయండి

జిల్లా ఎస్పీ వి. రత్న





పుట్టపర్తి, మార్చి 03, ప్రభాతవార్త

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన పిటీషన్ల పై వాస్తవాలను విచారించి చట్టపరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి.రత్న సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ నేతృత్వంలో చేపట్టారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజల నుండీ 44 పిటీషన్లు వచ్చాయి. ముఖ్యంగా భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, ఆన్లైన్ మోసాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు , మహిళా పి ఎస్, డి ఎస్ పి ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యాధికారికి ఘన సన్మానం

గుత్తి, మార్చి 3 ప్రభాతవార్త



డాక్టర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వైద్యవృత్తిలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఎండి జనరల్ మెడిసిన్ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వైద్యాధికారి డాక్టర్ రోహినాథ్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన గుత్తి ప్రభుత్వ వైద్యశాల, నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు వైద్యసేవలు అందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యునిగ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన ఎండి జనరల్ కోర్సులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మినారాయణరెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహినాథ్ మాట్లాడుతూ తాను తుది శ్వాశ వరకు ప్రజలకు వైద్య సేవలు అందిస్తానని పేర్కొన్నారు. తన ఉన్నతికి సహకరించిన గురువులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు, వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఐలో చేరిన మాజీ సిఐటియు నాయకులు



సిపిఐ పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

గుంతకల్లు, మార్చి 3 ప్రభాతవార్త

మాజీ సిఐటియు నాయకులు దాసరి శ్రీనివాసులు సోమవారం సిపిఐ పార్టీలో చేరారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామిలు కండువా వేసి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు దాదాపు 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. ప్రజా సమస్యల కోసం సిపిఐ చేసే భవిష్యత్తు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీకి మంచి పేరు తీసుకరావాలని నాయకులు కోరారు. పార్టీలో తనకు అప్పచెప్పే బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ప్రజాపోరులో తన వంతు పాత్ర పోషిస్తానని దాసరి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇదిలా వుండగా ఆయన సిపిఐ, సిఐటియులో సుదీర్ఘకాలంగా పనిచేసి అనివార్య కారణాల వల్ల కొద్దిరోజులుగా పార్టీకి దూరంగా వుంటూ వచ్చి చివరికి సిపిఐలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకుల గోపినాథ్, రాముదాయల్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే బ్రిడ్జి ట్రాఫిక్ కష్టాలు తీరేది ఎన్నడో..!!



బ్రిడ్జి కింద భారీ లారీ ఇరుక్కుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

గుంతకల్లు, మార్చి 3 ప్రభాతవార్త

కసాపురం గ్రామానికి వెళ్లే సత్యనారాయణపేట వద్ద వున్న రైల్వే బ్రిడ్జి ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నిత్యం వాహనదారులతో ఈ దారి రద్దీగా వుంటుంది. బ్రిడ్జి హైట్ తక్కువగా వుండడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్డు వెడల్పు కూడా తక్కువగా వుండడంతో సమస్య మరింత జఠిలమవుతూ వస్తోంది. సోమవారం సాయంత్రం ఓ భారీ వాహనం బ్రిడ్జి కింద ఇరుక్కుపోవడంతో వాహనదారులకు చుక్కలు కనిపించాయి. దాదాపు 45 నిమిషాల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఇలాంటి సమయంలో ఎవరికైనా ఎమర్జెన్సీ వస్తే ప్రాణాలు వదలాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి సమస్యను పరిష్కరించి విస్తరిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్పా పరిష్కరించింది లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు దాదులూరులో గావుల మహోత్సవం.

కనగానపల్లి మార్చి 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని దాదులూరు గ్రామంలో శ్రీ దాదులూరి పోతులయ్య స్వామి గావుల మహోత్సవం నేడు మంగళవారం తెల్లవారుజామున జరగనుంది అనంతరం స్వామివారికి మూగజీవాలు బలి ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఈ జాతరకు ఉమ్మడి జిల్లా తో పాటు కర్ణాటక రాష్ట్రం నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు సోమవారం దాదులూరు గ్రామానికి చేరుకున్నారు.

